సాక్షి రాజన్న సిరిసిల్ల

I

గురువారం । 2 । మే । 2024

దంచికొడుతున్న ఎండలు



సిరిసిల్ల: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. బుధవారం వడగాలులు వీచాయి. కలెక్టరేట్ వద్ద అత్యధికంగా 44.8 డిగ్రీలు నమోదయ్యాయి. రుద్రంగి మండలం మానాల వద్ద అత్యల్పంగా 41.5 డిగ్రీలు నమోదయ్యాయి. నాంపల్లి వద్ద 44.7 డిగ్రీలు, ఇల్లంతకుంటలో 44.5, మర్తనపేట, వట్టెంలలో 44.3, రుద్రంగిలో 44.1, పెద్దూరు వద్ద 44.0, మల్లారంలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్దలింగాపూర్‌లో 43.6, బోయినపల్లిలో 43.5, కందికట్కూర్ వద్ద 43.3, గంభీరావుపేటలో 43.0, నేరెళ్లలో 42.6, ఎల్లారెడ్డిపేట, గజసింగవరంలో 42.5, మరిగడ్డ, ఆవునూర్‌లో 42.3, నామాపూర్‌లో 41.9, నిజామాబాద్, వీర్నపల్లిలో 41.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

డీఈవోకు సన్మానం



డీఈవోను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: పది ఫలితాల్లో జిల్లాకు మూడో ర్యాంక్ రావడం అభినందనీయమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, రాంనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌ను బుధవారం సన్మానించారు. పక్కా ప్రణాళికతో సాధన చేయించిన ఉపాధ్యాయులు, కోఆర్డినేట్ చేసిన ఎంఈవోలు అభినందనీయులని డీఈవో కొనియాడారు. భవిష్యత్‌లో మొదటి ర్యాంక్ లక్ష్యంగా ముందుకెళ్లాలని కోరారు. టీపీటీఎఫ్ సిరిసిల్ల మండల అధ్యక్షుడు బూస రాజేందర్, కోనరావుపేట మండల బాధ్యులు నూగురి దేవేందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఆదుకుంటాం



పొన్నంతో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క స్పష్టం చేశారు. సిరిసిల్లలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కల్లూరి చందన ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి తమ సమస్యలు వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయించిందని, తమ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వెంటనే మంత్రి సీతక్కకు ఫోన్ చేసి అంగన్‌వాడీలతో మాట్లాడించారు. ప్రతీ నెల 1న జీతాలు చెల్లించాలని, వేసవి సెలవులు ఇప్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలని తదితర సమస్యలను వారు మంత్రి సీతక్కకు వివరించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని సీతక్క హామీ ఇచ్చారు. సానియ, శరణ్య, వనిత, రోజా ఉన్నారు.

5 నుంచి 'పోపా' ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు



మాట్లాడుతున్న పోపా ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: పద్మశాలి అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించనున్నట్లు పోపా కార్యదర్శి పున్నం చందర్ తెలిపారు. బుధవారం నిర్వహించిన పోపా సమావేశంలో మాట్లాడారు. వేసవి సెలవుల సద్వినియోగంతోపాటు ఇంగ్లిష్ భాషపై భయాన్ని పోగొట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 5 నుంచి నెల రోజులపాటు శివనగర్‌లోని కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్‌లో తరగతులు కొనసాగుతాయని తెలిపారు. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్సు డైరెక్టర్లుగా బూర శ్రీనివాస్, చేరాల తి రుపతి వ్యవహరిస్తారని ఆసక్తి గల విద్యార్థులు నేరుగా తరగతులకు హాజరుకావచ్చని సూచించారు. పోపా ప్రతినిధులు గాజుల ప్రతాప్, మచ్చ ఆనందం, కొక్కుల శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, బైరి రవీందర్, జయరాం, ఆడెపు వేణు, ఎం.వెంకటేశం, కె.దత్తు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు

సిరిసిల్లటౌన్: ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌కు ఆ పార్టీ నేతలు షాక్‌లు మీద షాక్‌లు ఇస్తున్నారు. గతంలో బీజేపీలో ఉండి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు వెళ్లిన నేతలు తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర మాజీ నాయకుడు అన్నల్‌దాస్ వేణుతోపాటు సుమారు 50 మంది నాయకులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ అభినందించారు. పార్టీలో చేరిన వారిలో బూర విష్ణు, కస్తూరి కార్తీక్‌రెడ్డి, సాయి కృష్ణ, ప్రసాద్, నవీన్, మహేందర్, సదానందం, సాయి, దయాసాగర్, రాజు, కృష్ణ, శ్రీధర్, సురేష్, మధు, గణేష్, దేవయ్య, సాయికృష్ణ, నిఖిల్, ప్రవీణ్ తదితరులున్నారు.

పర్యాటకంపై పట్టింపేది?

- ఆకట్టుకుంటున్న అనంత'గిరులు'
- ఆకర్షణీయంగా నాంపల్లి గుట్టపై అందాలు
- అయినా సిరిసిల్లకు దరిచేరని పర్యాటక శోభ
- ప్రతిపాదనల్లోనే అభివృద్ధి
- నీరులేక బోసిపోతున్న జలాశయాలు
- అటకెక్కిన టూరిజం హబ్ హామీ

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై అధికారులు, పాలకులకు పట్టింపు కరువైంది. జిల్లా వ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి కావాల్సిన వనరులు ఉన్నా పాలకుల్లో చిత్తశుద్ధి కరువై ఒక్క అడుగు కూడా ముందుకుపడడం లేదు. ఫలితంగా మిడ్‌మానేరు ప్రాజెక్టు, నాంపల్లి గుట్ట, నాగారంగుట్ట, వేములవాడ రాజన్న ఆలయ పరిసరాలలో అభివృద్ధి కనిపించడం లేదు.



వనరులు పుష్కలం

మధ్యమానేరు బ్యాక్‌వాటర్ అందాలు పాపికొండలను తలపిస్తాయి. అనంతగిరి జలాశయంలో ఐలాండ్ లక్నవరం అందాలను మైమరిపిస్తుంది. అయినా జిల్లాలో పర్యాటకాభివృద్ధి వెనుకబడింది. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అన్ని హంగులు ఉన్నాయని 2021లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ జలాశయాల్లో నీరు ఇంకిపోవడంతో పర్యాటక అభివృద్ధి పడకేసింది. జిల్లాలోని పర్యాటక కేంద్రాలు వెక్కిరిస్తున్నాయి.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రకృతి అందాలు

ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద నిర్మించిన అన్నపూర్ణ రిజర్వాయర్‌లో సహజ సిద్ధమైన ప్రకృతి అందాలు ఉన్నాయి. జలాశయం మధ్యలో గుట్టపై 40 ఎకరాల స్థలం ఉండడంతో ఐలాండ్‌గా ఆ గుట్టను లక్నవరం తరహాలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. అన్నపూర్ణ ప్రాజెక్టు, అక్కడే ఉండే పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్‌ను పర్యాటకంగా అభివృద్ధిలో భాగంగా ఆలయాన్ని నిర్మించారు. కానీ నీరు లేక ప్రకృతి అందాలు కళావిహీనంగా మారాయి.

రాష్ట్రంలోనే అగ్రస్థానంలో వేములవాడ రాజన్న



రాష్ట్రంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం పర్యాటకులను ఆకట్టుకోవడంలో అగ్రస్థానంలో ఉంది. ఏటా కోటి మంది భక్తులు రాజన్నను దర్శించుకుంటున్నారు. వేములవాడ రాజన్నను దర్శించుకునే భక్తులు పక్కనే ఉన్న నాంపల్లి గుట్టపైకి వెళ్తారు. అక్కడి నుంచి కనిపించే మధ్యమానేరు జలాశయం అందాలను వీక్షించడంతోపాటు మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌లో విహరించేలా తెలంగాణ టూరిజం శాఖ ఏర్పాట్లు చేసింది. రాజన్నను దర్శించుకుని వచ్చే ప్రతి భక్తుడు మధ్యమానేరు అందాలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. వేములవాడఅర్బన్ మండలం పరిధిలోని రామప్ప నుంచి మధ్యమానేరులో విహరించే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు నీరింకిపోయి పర్యాటకాభివృద్ధి బుట్టదాఖలైంది.




సిరిసిల్లలో లాంచీ వసతి



సిరిసిల్ల జిల్లా కేంద్రాన్ని తాకిన మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌లో తెలంగాణ టూరిజం శాఖ లాంచీని ఏర్పాటు చేసింది. డబుల్ డెక్కర్‌తో కూడిన లాంచీని సిద్ధంగా ఉంచారు. సిరిసిల్ల మానేరు కరకట్ట నుంచి రామప్పగుట్టల మధ్య నుంచి మధ్యమానేరు జలాశయం వరకు బోటింగ్ వసతి కల్పించాలని భావించారు. నిజానికి పాపికొండల అందాలు రామప్పగుట్టల్లో కనిపించడం విశేషం. కానీ మధ్యమానేరులో నీటి నిల్వ సామర్థ్యం 7 టీఎంసీలకు పడిపోవడంతో సిరిసిల్ల వద్ద మధ్యమానేరు బ్యాక్‌వాటర్ 12 కిలోమీటర్లు ఉండగా.. ఇప్పుడు నీరు లేకుండా పోయింది. లాంచీ వృథాగా ఉంది.

బోసిపోతున్న ప్రకృతి అందాలు



గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ఇప్పటికే పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఎగువమానేరులో బోటింగ్ వసతి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సముద్రలింగాపూర్ శివారులోని సింగసముద్రం ఆరు మత్తళ్లు వినూత్నంగా ఉన్నాయి. ఇవి పర్యాటకులను ఆకట్టుకుంటాయి. కానీ మొత్తంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రిజర్వాయర్లను, ప్రకృతి సహజమైన గుట్టలు ఇప్పుడు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ప్రతిపాదనలకు మోక్షం లభిస్తే.. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి సాధ్యమవుతుంది. జిల్లాను టూరిజం హబ్‌గా మార్చితే బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి.

నేతకార్మికులను ఆదుకుంటాం

- మహిళా సంఘాలను బలోపేతం చేస్తాం
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సిరిసిల్లలో పాదయాత్ర చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, అభ్యర్థి రాజేందర్‌రావు

సిరిసిల్ల: సిరిసిల్ల నేతన్నలు, వస్త్రపరిశ్రమను ప్రభుత్వం ఆదుకుంటుందని, గతంలో కంటే మెరుగైన జీవన ప్రమాణాలు ఉండేలా చూస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం నిర్వహించిన మే డే వేడుకల్లో పాల్గొన్నారు. జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇస్తామన్నారు. అట్టడుగున శ్రమించే నేతకార్మికుల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని ప్రకటించారు. మహిళా సంఘాలను సైతం బలోపేతం చేస్తామన్నారు. సిరిసిల్లను టెక్స్‌టైల్ సిటీగా మార్చుతామని, గత బీఆర్‌ఎస్ ప్ర భుత్వం పెట్టిన బకాయిలు రూ.350కోట్లను విడుదల చేయిస్తామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 3వ తేదీన నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్రాలను 'వస్త్ర విహార్' పేరిట మార్కెటింగ్ చేయిస్తానని హామీ ఇచ్చారు. కె.కె.మహేందర్‌రెడ్డి, చీటి ఉమేశ్‌రావు, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, వెంకట్‌రెడ్డి, గడ్డం నర్సయ్య, మడుపు శ్రీదేవి, వెల్ముల స్వరూపారెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్, వెంకటరమణ, మధు పాల్గొన్నారు.

వేములవాడ/వేములవాడఅర్బన్/వేములవాడ రూరల్/కోనరావుపేట: వేములవాడలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని బుధవారం ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అంటూ ఇంటింటికీ ప్రచారం చేయాలని సూచించారు. బూత్ లెవల్‌లో వచ్చిన ఓట్ల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తామని తెలిపారు. అనంతరం కోనరావుపేట, వేములవాడఅర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లో నిర్వహించిన రోడ్‌షోలలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ, నిరుద్యోగ భృతి ఇస్తామన్న బీఆర్‌ఎస్‌లు ప్రజలను మోసం చేశాయన్నారు. ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో చేసిందేమి లేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అభివృద్ధి జరిగినట్లుగానే రేవంత్‌రెడ్డి కూడా చేస్తున్నారన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. ముంపు గ్రామాల సమస్యలపై ఆది శ్రీనివాస్, నేను పోరాడమని, ఇప్పుడు మీ సమస్యలను మేమే పరిష్కరిస్తామన్నారు. రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆరేపల్లి మాజీ సర్పంచులు ఇటిక్యాల నవీన రాజు, సిలివేణి మల్లేశం కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. వేములవాడరూరల్ మండలం నమిలిగుండుపల్లిలోని శ్రీమహంకాళి బీరప్ప కల్యాణం, వట్టెంలలో ఎల్లమ్మ సిద్గోగంలో పాల్గొన్నారు. వివిధ మండలాల అధ్యక్షులు షేక్ ఫిరోజ్‌పాషా, వకుళాభరణం శ్రీనివాస్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగాధర్, కచ్చకాయల ఎల్లయ్య, గోపాల్, గొట్టి రుక్మిణి, చారి పాల్గొన్నారు.



ఘనంగా మే డే

మేడేను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. జెండాలు ఆవిష్కరించి, ర్యాలీలు తీశారు. కార్మికహక్కుల సాధనకు అలుపెరగకుండా పోరాడాలని పిలుపునిచ్చారు.

– ముస్తాబాద్(సిరిసిల్ల)

జిల్లాకు అగ్రనేతల తాకిడి

- హోరెత్తనున్న ప్రచారం






సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేసేందుకు మూడు ప్రధాన పార్టీల అగ్రనేతలు జిల్లాకు రానున్నారు. ఎన్నికలకు 12రోజులు మాత్రమే గడువు ఉండడంతో పార్లమెంట్ సీట్లను ఎలాగైనా కైవసం చేసుకోవాలని మూడు ప్రధాన పార్టీల నేతలు వ్యూహరచనలో మునిగారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 8న వేములవాడలో నిర్వహించే భారీ బహిరంగసభకు హాజరుకానున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 3న సిరిసిల్ల బహిరంగ సభలో పాల్గొననున్నారు. త్వరలోనే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల జరిగే భారీ బహిరంగ సభలకు హాజరయ్యే అవకాశముంది. మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్ర ద్వారా 3న రామగుండం రోడ్‌షోలో పాల్గొని రాత్రి అక్కడే బస చేస్తారు. 4న మంచిర్యాలలో జరిగే రోడ్‌షోలో ప్రసంగించి రాత్రి కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్‌లో బస చేయనున్నారు. 5న జగిత్యాలలో జరిగే రోడ్‌షోలో పాల్గొని రాత్రికి అక్కడే బస చేయనున్నారు. 9వ తేదీన కరీంనగర్ జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించి రాత్రి బస చేయనున్నారు. ఈనెల 10వ తేదీన సిరిసిల్లలో జరిగే రోడ్‌షోలో పాల్గొని అక్కడి నుంచి సిద్దిపేట బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్తారు. అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లనున్నారు.

277 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

- 197 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- జిల్లాలో హోమ్ ఓటింగ్‌కు ఏర్పాట్లు
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని 277 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 197 పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించగా.. కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 744 మంది హోమ్ ఓటింగ్‌లో పాల్గొంటారని, ఈనెల 3 నుంచి 5 వరకు హోమ్ ఓటింగ్ పూర్తి చేసేందుకు 19 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేములవాడ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోస్టల్ బ్యాలెట్ కోసం నూతన గ్రంథాలయ భవనం(తహసీల్దార్ ఆఫీస్ ప్రాంగణం), సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూములను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలోని 2,88,153 మంది ఓటర్లకు 61 శాతం మేరకు ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆదనపు కలెక్టర్ పి.గౌతమి, సిరిసిల్ల ఆర్డీవోలు రమేశ్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీపీవో శ్రీనివాసాచారి, డీఈవో రమేశ్ కుమార్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి పాల్గొన్నారు.

ఈసీ మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమీషన్ (ఈసీ) మార్గదర్శకాలపై అవగాహన ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సిరిసిల్లలోని గీతానగర్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన నియమ, నిబంధనలపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు అవగాహన కలిగి ఉంటే నమ్మకంతో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించవచ్చన్నారు. హ్యాండ్ బుక్ ఫర్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ బుక్ లోని అన్ని నిబంధనలను జాగ్రత్తగా చదవాలన్నారు. పోలింగ్ రోజు సందేహాలు ఉన్న, సమస్యలు ఎదురైనా సెక్టార్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. తహసీల్దార్లు షరీఫ్ మోహినొద్దీన్, మహేశ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

- ఎన్నికల నిబంధనలు పాటించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



వాలీబాల్ ఆడి ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఎన్నికల విధులు బాధ్యతతో నిర్వర్తించాలని, గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా భద్రత చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. పోలీస్ ఆఫీస్‌లో బుధవారం జిల్లా పోలీస్ అధికారులతో ఎన్నికల విధులపై సమీక్షించారు. డైనమిక్ తనిఖీలు చేపడుతూ మద్యం, డబ్బు తరలిపోకుండా చూడాలన్నారు. తరచూ పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులు తెలుసుకోవాలని సూచించారు. సోషల్‌మీడియాపై దృష్టి పెట్టాలన్నారు. ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, మురళీకృష్ణ, సర్వర్, సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, శ్రీనివాస్, వీరప్రతాప్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మధుకర్, ఆర్‌ఐలు యాదగిరి, రమేశ్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు

విద్యార్థులకు చదువుతోపాటు మానసికోల్లాసం కోసం క్రీడలు ముఖ్యమేనని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట ఠాణాల పరిధిలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. సిరిసిల్లలోని కాలేజీ గ్రౌండ్‌లో బుధవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఆర్చరీ, యోగ, క్రికెట్, కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ, పోలీస్‌శాఖలో అమలు చేస్తున్న అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం. చెడుమార్గాల వైపు వెళ్లకుండా ఉంచేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్రీడలతో శారీరక దృఢత్వం కలగడంతోపాటు ఒత్తిడి దూరమవుతుందన్నారు. నిజ జీవితంలో సమష్టి కృషితోనే విజయాలు సాధించగలమన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ రఘుపతి, సదన్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై రమేశ్ ఉన్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- 3.35 మీటర్లకు పడిపోయిన భూగర్భజలం



అడుగంటిపోయిన వ్యవసాయ బావి

సిరిసిల్ల: జిల్లాలో గతేడాదితో పోల్చితే.. 3.35 మీటర్ల లోతుకు భూగర్భ జల నీటి మట్టం పడిపోయిందని జిల్లా భూగర్భజల అధికారి గంగం నర్సింహులు బుధవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ నెల భూగర్భ జలాల నివేదికను వెల్లడించారు. గతేడాది మేలో జిల్లాలో సగటున 8.33 మీటర్ల లోతుల్లో భూగర్భ జలాలు ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే అంటే.. నెల రోజుల ముందుగానే 11.68 మీటర్ల లోతుల్లోకి నీటి మట్టం పడిపోయిందని తెలిపారు. వీర్నపల్లి మండలంలో అత్యధిక లోతు 28.16 మీటర్ల కింద నీటి ఊటలు ఉన్నట్లు గుర్తించారు. వేములవాడరూరల్ మండలంలో 6.82 మీటర్ల లోతులోనే నీటి ఊటలు ఉండడం విశేషం. జిల్లాలో సగటు 11.68 మీటర్లకు పాతాళ గంగమ్మ పడిపోయింది. మే నెలాఖరు నాటికి భూగర్భ జల మట్టం మరింత పడిపోయే ప్రమాదం ఉంటుందని భావిస్తున్నారు.

కాంగ్రెస్ అనుకూల పవనాలు



పార్టీ కండువా కప్పుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: దేశంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో కనీసం కోడిగుడ్లు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మేడిపల్లి వైస్‌ఎంపీపీ దొంతి శ్రీనివాస్, దేశాయిపేట మాజీ సర్పంచ్ దొంతి వనితతోపాటు యాభై మంది కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఆరు గ్యారంటీల గురించి వివరించి, ఓట్లు అడగాలని కోరారు. నరేంద్రమోదీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. నల్లధనం, ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీలు అమలు చేయలేదన్నారు.

క్లుప్తంగా

రేపు ఖనికి కేసీఆర్!



సాక్షి, పెద్దపల్లి: మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 3న సాయంత్రం 6గంటలకు గోదావరిఖనిలో రోడ్డుషో నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. కాంగ్రెస్ పార్టీపై సిరిసిల్లలో ఆయన ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో బుధవారం రాత్రి 8గంటల నుంచి 48 గంటల పాటు ప్రచారం చేయకుండా కేంద్ర ఎన్నికల సంఘం కేసీఆర్‌పై నిషేధం విధించిన విషయం విదితమే. దీంతో శుక్రవారం రాత్రి 8గంటల వరకు మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదు. అయితే, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గురువారం జమ్మికుంటలో చేపట్టిన బస్సుయాత్ర రద్దు అయ్యింది. శుక్రవారం గోదావరిఖనిలో చేపట్టే రోడ్డుషోను సాయంత్రం 6 గంటలకు నిర్వహించాల్సి ఉండగా, దానిని రాత్రి 8 గంటల తర్వాత ప్రారంభించనున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ 'సాక్షి'కి తెలిపారు. కేసీఆర్ బస్సుయాత్ర రద్దు కాలేదని, కేవలం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. తొలుత రామగుండం మున్సిపల్ కార్యాలయం నుంచి గోదవరిఖని ప్రధాన చౌరస్తా వరకు రోడ్డుషో నిర్వహిస్తారు. ఆ తర్వాత చౌరస్తాలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ ప్రసగిస్తారని ఈశ్వర్ వివరించారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

- మృతుడు పశ్చిమబెంగాల్‌వాసి

కొత్తపల్లి(కరీంనగర్): ఓ వలస కార్మికుడు గుండెపోటుతో మృతిచెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని నాంపాల్ పురూలియా గ్రామానికి చెందిన రాంపాడ దాస్(22) కొత్తపల్లి రెడ్డిరాంపల్లి వద్ద రైల్వే ట్రాక్ పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి చాతిలో నొప్పి రావడంతో అతని బంధువు బీబీ సాన్‌దాస్ కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు రాంపాడ దాస్ మృతిచెందినట్లు నిర్ధారించారు. సాన్‌దాస్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భూమానాయక్ అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం డబ్బాకు చెందిన భూమానాయక్ ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా ఇన్నోవా వాహనం వచ్చి ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామడుగు: కరీంనగర్ -జగిత్యాల ప్రధాన రహదారిపై రామడుగు మండలం వెదిర గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెదిర గ్రామానికి చెందిన యువకుడు శనిగరపు వినయ్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు శనిగరపు సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. వినయ్, సంపత్ ద్విచక్ర వాహనంపై వెదిర క్రాస్ రోడ్డు నుంచి గ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సంఘటన స్థలాన్ని రామడుగు ఎస్‌ఐ సురేందర్ పరిశీలించారు.

ఊపిరి ఉన్నంతవరకు ఉద్యమంలోనే..

- ముగిసిన నాలుగు దశాబ్దాల పోరుబాట
- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో చీమల నర్సయ్య మృతి
- మావోయిస్ట్‌పై 195 కేసులు.. రూ.25లక్షల రివార్డు



పాలకుర్తి(రామగుండం): పెత్తందారీ వ్యవస్థపై పోరు సాగించిన మావోయిస్టు నేత చీమల నర్సయ్య ఉరఫ్ జోగన్న నాలుగు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, నిత్య నిర్బంధం ఉన్నా, అనేక ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నా.. ఏమాత్రం చలించలేదు. శత్రువుకు వెన్నుచూపలేదు. చివరి శ్వాసవరకూ మావోయిస్టు పార్టీలోనే కొనసాగారు. చివరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ ఎక్‌మెట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు వదిలారు. ఆయనది పాలకుర్తి మండలం జయ్యారం స్వగ్రామం. ఈ ఘటనలో పదిమంది నక్సల్స్ మృతి చెందారని పోలీసులు ప్రకటించారు.

42ఏళ్లుగా ఉద్యమంలోనే..

- అప్పటి ఉమ్మడి రామగుండం, ప్రస్తుత పాలకుర్తి మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు.
- దీంతో తల్లి భీమరాజు అన్నీ తానైంది.
- తన పెద్దకూతురు రాజక్క, నర్సయ్యను పెంచి పెద్దచేసింది.
- పెత్తందారుల అకృత్యాలు, అరాచకాలతో చలించిన అప్పటి పీపుల్స్‌వార్ నేత, రాణాపూర్ గ్రామానికి చెందిన బయ్యపు దేవేందర్‌రెడ్డికి పెత్తందారుల అరాచకాలు వివరించారు.
- ఈనేపథ్యంలో నక్సల్స్ పలుమార్లు పెత్తందార్లను హెచ్చరించినా పద్ధతి మార్చుకోలేదు.
- పైగా నర్సయ్యతోపాటు అదే గ్రామానికి కొందరిపై దాడులు చేశారు.
- పోలీసు కేసులు నమోదు చేయించారు.
- ఈక్రమంలో జైలు జీవితం అనుభవించిన నర్సయ్య.. విడుదలయ్యాక 1983లో అప్పటి పీపుల్స్‌వార్(ప్రస్తుత మావోయిస్టు) పార్టీలో చేరారు.
- తొలుత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బ్రాహ్మఘాట్ దళంలో చేరారు.
- అనంతరం వేటవెల్లిదళంలో చాలాకాలం పాటు కొనసాగారు.
- నర్సయ్యతోపాటు పార్టీలో చేరిన అప్పటి స్థానికుల్లో ఒకరిద్దరు వివిధ కారణాలతో పోలీసులకు లొంగిపోయారు. అయినా, నర్సయ్య ఉద్యమబాట వీడలేదు.

కుడికన్నుకు గాయమైనా..

1992లో గ్రెనేడ్ విసిరి వేయడంలో శిక్షణ పొందుతున్న సమయంలో నర్సయ్య తీవ్రంగా గాయపడ్డారు. అకస్మాత్తుగా అది పేలడంతో కుడికన్నుకు గాయమైంది. ఆ తర్వాత ఎడమకన్ను సాయంతోనే కార్యకలాపాలు సాగించారు. కన్నుకు గాయమైన సమయంలో దాదాపు ఆర్నెల్లపాటు విశ్రాంతి తీసుకున్నారని, తెలుగు, హిందీ భాషల్లో చదవడం, రాయడం నేర్చుకున్నారని సమాచారం. అయితే, ఎన్‌కౌంటర్‌లో నర్సయ్య మృతి చెందారనే సమాచారం కలకలం రేపుతోంది.

- ప్రస్తుతం మాడ్ ప్రాంతంలో వెస్ట్ సబ్‌జోనల్ మిలటరీ కమాండర్‌గా కొనసాగుతున్నారు.

ఆయనపై 195 కేసులు నమోదయ్యాయి. రూ.25లక్షల రివార్డు ఉంది.

ఒక్కసారే స్వగ్రామానికి రాక..

దాదాపు 40ఏళ్లలో నర్సయ్య ఒకేఒక్కసారి తన స్వగ్రామం జయ్యారానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. 1990లో తన తల్లిని చూసేందుకు వచ్చి వెళ్లారని, అప్పటినుంచి ఇప్పటివరకు గ్రామానికి రాలేదని తెలిపారు. ఆయన తల్లి పదేళ్లక్రితమే చనిపోయిందంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో రెండు గుంటల ఇంటి స్థలం తప్ప ఎలాంటి ఆస్తిపాస్తులు కూడా లేవు. ఆయన బంధువులెవరూ స్థానికంగా నివాసం ఉండడంలేదు.

పరారైన వ్యక్తి ఆచూకీ ఏది?

- ఠాణా గోడ దూకి పరారైన ఖైదీ
- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- 48 గంటలు గడిచినా లభించని ఆచూకీ
- ఉన్నతాధికారుల సీరియస్



పారిపోయిన నిందిడుతు ఇతడే

చందుర్తి(వేములవాడ): చందుర్తి పోలీసుల కళ్లుగప్పి ఠాణా నుంచి పరారైన గంజాయి నిందితుడి ఆచూకీ 48 గంటలు గడిచినా దొరకలేదు. బహిర్భూమికి అని చెప్పి గోడ దూకి పరారైన సదరు వ్యక్తి కోసం పోలీసులు చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ఠాణా నుంచి ఓ కేసులో నిందితుడు పరారు కావడంపై ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నట్లు తెలిసింది. స్థానిక సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

గర్షకుర్తిపై పోలీసుల నజర్

చందుర్తి మండలం మర్రిగడ్డ శివారులో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ వ్యక్తిది బోయినపల్లి మండలం గర్షకుర్తి కావడంతో ఈ గ్రామంపై పోలీసులు నజర్ పెట్టారు. అతని కుటుంబ సభ్యుల, బంధువుల ఫోన్ నంబర్లు సేకరించి, వారి కాల్స్‌పై దృష్టిపెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఈ ఘటనకు బాధ్యులెవరో?

మర్రిగడ్డ శివారులో సోమవారం రాత్రి 8.35 గంటలకు గంజాయితో సంచరిస్తున్న వ్యక్తిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని చందుర్తి పోలీసులకు అప్పగించారు. ఆ సమయంలో ఠాణాలో ఉన్న సిబ్బంది ఎవరు, ఈ ఘటనకు ఎవరిని బాధ్యులను చేస్తారోనని ఠాణా సిబ్బందిలో వణుకు మొదలైంది. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యంపై వ్యవహరిస్తున్న వారిపై జిల్లా పోలీస్‌బాస్ కొరడా ఝుళిపించగా.. ఈ ఘటనలో ఎవరు బలి అవుతారోననే చర్చ సాగుతోంది.

పరువు పోయిందని ప్రాణం తీశాడు

- కోడలిని కత్తితో నరికి చంపిన మామ
- యువతిని వేధించిన ఇద్దరు యువకులు
- వేధిస్తున్నారని గతనెల 27న పోలీసులకు ఫిర్యాదు



మౌనిక మృతదేహం



మౌనిక (ఫైల్)

సారంగాపూర్: కుటుంబం పరువు తీసిందన్న కోపంతో కోడలిని కత్తితో అతికిరాతంగా నరికి చంపాడో మామ. ఈ సంఘటన సారంగాపూర్ మండలం లచ్చనాయక్‌తండా శివారు గ్రామం కొత్తపల్లితండాలో బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్‌అలీఖాన్, ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. రేచపల్లికి చెందిన ఆకుల మౌనికకు కొత్తపల్లితండాకు చెందిన తిరుపతితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కూతుళ్లు సంతానం. తిరుపతి బతుకుదెరువు నిమిత్తం కొద్దిరోజుల క్రితం న్యూజిలాండ్ దేశం వెళ్లాడు. మౌనికతో రేచపల్లి, లచ్చక్కపేటకు చెందిన ఇద్దరు యువకులు కొద్దిరోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. వేధింపులు భరించలేని మౌనిక గత నెల 27న సారంగాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరు యువకులపై 354 డి సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మౌనిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంపై మామ ఆకుల రాజిరెడ్డి జీర్ణించుకోలేకపోయాడు. కుటుంబం పరువుపోయిందని ఆమెపై ఆగ్రహంతో ఊగిపోయాడు. మౌనికను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం రాత్రి మౌనిక తన గదిలో ఇద్దరు కూతుళ్లతో కలిసి నిద్రపోయింది. ఆరుబయట పడుకున్న రాజిరెడ్డి పథకం ప్రకారం బుధవారం వేకువజామున 5గంటలకు అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న మటన్ కోసే కత్తితో మౌనిక మెడపై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో మౌనిక అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి తోట రాజం, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. తన కూతురును చంపిన రాజిరెడ్డితోపాటు ప్రోత్సహించిన మౌనిక భర్త తిరుపతి, అత్త గంగవ్వపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి తోట రాజం ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సార్వత్రిక సమరం.. సిబ్బంది కీలకం

- ర్యాండమైజేషన్‌తో విధులు కేటాయింపు
- సార్వత్రిక ఎన్నికలకు తొలి దశ పూర్తి
- రేపే రెండో దశ ర్యాండమైజేషన్



ఎన్నికల విభాగంలో ఉద్యోగుల విధులు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం యుద్ధప్రతిపాదికన చర్యలు చేపడుతోంది. ఐదు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 2194 పోలింగ్ కేంద్రాలుండగా 8,784 మంది పోలింగ్ సిబ్బందిని ఇప్పటికే నియమించగా అదనంగా 4,392 మంది అవసరం. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, ఇద్దరు సిబ్బందితో కలిపి మొత్తం నలుగురు విధులు నిర్వహించనున్నారు. కాగా వీరందరికి శిక్షణ ప్రారంభమైంది. ఇప్పటికే తొలిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసింది. శిక్షణలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్లను ఎలా ఉపయోగించాలనే దానిపై మాస్టర్ ట్రైనర్లు వివరిస్తున్నారు. మాక్ పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు. మొత్తం మూడుస్థాయిల్లో శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు సంబంధించిన హ్యాండ్ బుక్, ఇతర బాధ్యతలపై ప్రత్యేక శిక్షణనిచ్చారు.

మొదటి దశ పూర్తి

ఇప్పటికే జిల్లాలో మొదటిదశ ర్యాండమైజేషన్‌ను అధికారులు పూర్తి చేశారు. అధికారుల పర్యవేక్షణలో రాజకీయ ప్రతినిధులతో కలిసి ఈ ప్రక్రియను చేపట్టారు. కరీంనగర్ లోక్‌సభ స్థానంలో మొత్తం 3,200 బ్యాలెట్ యూనిట్లు, 2260 కంట్రోల్ యూనిట్లు, 2260 వీవీప్యాట్లు అందుబాటులో ఉన్నాయి. పోలింగ్ రోజు ఈ ఈవీఎం యంత్రాలనే ఉపయోగించనున్నారు. వీటిపై ఎలాంటి అనుమానాలు, ఇతర సాంకేతిక సమస్యలున్నా ర్యాండమైజేషన్లో బయటకొస్తాయి. మొదటి దశ పూర్తి కావడంతో వాటిని భద్రపరిచారు. మొదటి దశ ర్యాండమైజేషన్ జిల్లాస్థాయిలో జరగగా రెండో విడత ర్యాండమైజేషన్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించనున్నారు. పోలింగ్ జరగడానికి ఒకరోజు ముందు కమిషనింగ్ ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

సెక్టోరియల్ అధికారులపై దృష్టి

ఎన్నికల సామగ్రి సరఫరా, పోలింగ్‌తో పాటు కౌంటింగ్ వరకు సెక్టోరియల్ అధికారులే కీలక భూమిక పోషిస్తారు. ప్రతి సెక్టోరియల్ అధికారి పర్యవేక్షణలో పీవోలు పనిచేయాల్సి ఉంటుంది. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 219 మంది సెక్టోరియల్ అధికారులను నియమించి శిక్షణనిస్తున్నారు. పోలింగ్ రోజు రూట్ల వారీగా ఎన్నికల సామగ్రిని తరలించనున్నారు. పోలింగ్ జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాలి. కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులుంటే దృష్టి సారించాలి. ఓటింగ్ యంత్రాలు మొరాయిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం వాటిని స్ట్రాంగ్ రూంలకు తరలించాలి.

రేపే రెండో దశ ర్యాండమైజేషన్

తొలిదశ ర్యాండమైజేషన్ పూర్తయినందున ఈవీఎంలను గోడౌన్ నుంచి తరలించారు. కరీంనగర్ కలెక్టరేట్ వెనుకాల గల ఈవీఎం గోడౌన్‌లో ర్యాండమైజేషన్ జరగగా అక్కడి నుంచి స్ట్రాంగ్ రూంలకు తరలించారు. పోలింగ్ తేదీకి మూడు రోజుల ముందు కమిషనింగ్ నిర్వహించనున్నారు. కరీంనగర్, చొప్పదండి సెగ్మెంట్లకు గానూ ఎస్సారార్ కళాశాలలో భద్రపరచగా మానకొండూరుకు సంబంధించి ఎల్ఎండీ పాలిటెక్నిక్ కళాశాలలో, హుజూరాబాద్‌కు సంబంధించి అక్కడి ప్రభుత్వ హైస్కూల్‌కు తరలించారు. వేములవాడ, సిరిసిల్లకు సంబంధించి అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల, హుస్నాబాద్‌కు సంబంధించి సిద్దిపేటలో గల స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. కాగా రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈ నెల 3 నుంచి నిర్వహించనున్నారు. సదరు దశ తదుపరి కమిషనింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. సదరు ఈవీఎంలను మే 12 సాయంత్రం పోలింగ్ బూత్‌లకు చేరనుండగా మే 13న పోలింగ్ ముగిసిన అనంతరం అన్నింటిని ఎస్సారార్ కళాశాలకు చేర్చనున్నారు. జూన్ 04న ఓట్ల లెక్కింపు జరగనుండగా పటిష్ట భద్రతను ఏర్పాటు చేయనున్నారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో
పోలింగ్ కేంద్రాలు: 2,194
పోలింగ్ సిబ్బంది: 13,176
నియోజకవర్గాలు : 7(కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల)

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఈవీఎంలు
కరీంనగర్	395	493
చొప్పదండి	327	408
మానకొండూరు	316	395
హుజూరాబాద్	305	381
హుస్నాబాద్	304	380
వేములవాడ	260	325
సిరిసిల్ల	287	358

భూవిక్రయం పేరిట మోసం

- కబ్జాలో లేని భూమి రిజిస్ట్రేషన్
- పోలీసుల ఆశ్రయించిన బాధితురాలు
- మోసగానిపై కేసు, రిమాండ్

సిరిసిల్లక్రైం: తన ఆధీనంలో లేని భూమిని విక్రయించి రూ.20 లక్షలు తీసుకొని ఆ భూమి హద్దులు చూపించని వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన మంత్రి రఘు 2022లో కోనరావుపేటలో తన కబ్జాలో లేని భూమిని తనదిగా నమ్మించి, వేములవాడరూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంపల్లి విజయకు రూ.20లక్షలకు విక్రయించాడు. తన కబ్జాలో లేని ఎక్కడో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆ భూమి హద్దులు చూపించకుండా విజయను ఇబ్బందులకు గురిచేశాడు. మరో రూ.లక్ష ఇస్తే భూమి హద్దులు చూపిస్తాననగా.. నమ్మి మరో రూ.లక్ష ఇచ్చింది. భూమి హద్దులు చూపెట్టాలని కోరగా.. తాను మాజీ నక్సలైట్‌ను అని మరోసారి డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. విసిగిపోయిన బాధితురాలు విజయ కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంత్రి రఘును అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిందితునికి సహకరించిన ఇతరులపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. మంత్రి రఘు చేతిలో మోసపోయిన బాధితులు ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు.

ఎరువు కోసం పరస్పరం దాడి

- ఇద్దరికి గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



గాయపడిన వ్యక్తి

వేములవాడరూరల్: ఇంటి ముందు ఉన్న గొర్రెల ఎరువు విషయంలో కుటుంబసభ్యుల మధ్య మొదలైన గొడవ దాడి చేసుకునే వరకు చేరింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గాయపడ్డ ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన వేములవాడ రూరల్ మండలం నూకలమర్రితండాలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. నూకలమర్రితండాకు చెందిన రాజు, అజయ్ మధ్య గొర్రెల ఎరువు వివాదాస్పదంగా మారింది. వాగ్వాదంతో మొదలై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. బ్లూకోర్ట్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు పూర్తి విచారణ చేపట్టారు. ఈ విషయంపై ఎస్సై మారుతిని వివరణ కోరగా జరిగిన సంఘటన వాస్తమే అన్నారు. అయితే ఫిర్యాదు రాలేదని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రేమ దక్కలేదనే ఆవేదనతో యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బద్దెనపల్లిలోని పెట్రోల్ బంక్ సమీపంలో పంచర్‌షాప్ నిర్వహిస్తున్న బిహార్‌కు చెందిన మహ్మద్ సజన్ (23) బుధవారం తన పంచర్‌షాపులోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ ఎండీ సమీర్ తెలిపిన వివరాలు. బిహార్ రాష్ట్రంలోని వైశాలి జిల్లా కొఫిడ సన్‌పూర్‌కు చెందిన సజన్ నాలుగేళ్లుగా బద్దెనపల్లిలో పంచర్‌షాప్ నిర్వహిస్తున్నాడు. సజన్ ఆస్తామాతో బాధపడుతుండేవాడు. అంతేకాకుండా సజన్ ప్రేమించిన అమ్మాయి వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతో మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఉదయం పంచర్‌షాపులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ సమీర్ ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో బాలిక మృతి



శ్రీలక్ష్మి(ఫైల్)

రామడుగు: రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జక్కుల బాబు- రజిత కూతురు శ్రీలక్ష్మి బుధవారం గుండెపోటుతో చనిపోయిందని గ్రామస్తులు తెలిపారు. రామడుగుకు చెందిన శ్రీలక్ష్మి తొమ్మిదోతరగతి పూర్తిచేసి ఇంటివద్దే ఉంటోంది. రెండు రోజుల క్రితం జ్వరం వచ్చింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి విషమించింది. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో బుధవారం మధ్యాహ్నం గుండెపోటుకు గురై చనిపోయింది. శ్రీ లక్ష్మి మృతి విషయమై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

రైస్‌మిల్లులో కాలిన జనరేటర్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): బొంతకుంటపల్లిలోని స్రవంతి రైస్‌మిల్లులో బుధవారం ప్రమాదవశాత్తు జనరేటర్ కాలిపోయింది. పక్కనే నిల్వచేసిన ధాన్యం బస్తాలకు మంటలు వ్యాపించకుండా సిబ్బంది సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో ప్రమాదం తప్పినట్లయ్యిందని యాజమాని పురుషోత్తం తెలిపారు. జనరేటర్ కాలిపోవడంతో దాదాపు రూ.11లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కరీంనగర్‌క్రైం: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలంలోని చెర్లభూత్కుర్, ఫకీర్‌పేట గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. బుధవారం తనిఖీలు చేపట్టగా ఫకీర్‌పేటకు చెందిన ఆడపా వంశీ, మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన తప్పెటి నితీశ్‌కుమార్, కశ్మీర్‌గడ్డకు చెందిన ఎండీ.ఉమర్ అలియాస్ నోమస్‌లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 603 గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయి సేవిస్తున్న మరో ఐదుగురిని అదుపులోకి తీసుకొని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. సిబ్బంది మోసిన్, కుమార్ యాదవ్, ఖాసింబీ, కమలాకర్, వర్మ, జీవన్ ఉన్నారు.


కుక్కల దాడిలో దూడలు మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని గుంటూరుపల్లిలో కుక్కల దాడిలో రెండు దూడలు మృతిచెందాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంభం నర్సయ్య గేదెల పెంపకంతో ఉపాధి పొందుతున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఆయన ఇంటి ముందున్న రెండు దూడలపై వీధి కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో బాధితుడు కన్నీరు పెట్టుకున్నాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు వాటిని దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

అక్కాచెల్లెళ్ల అదృశ్యం : ఇద్దరూ మైనర్లే..

మల్యాల(చొప్పదండి): ఇంటినుంచి బయటకు వెళ్లిన అక్కాచెల్లెళ్లు అదృశ్యమైన సంఘటన మల్యాల మండలం ఒబులాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై అబ్దుల్ రహీం కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు (17), (15). వీరి తల్లి 25 రోజుల క్రితం మృతిచెందింది. గత నెల 30న తండ్రితో కలిసి ఇంటి దాబాపై పడుకున్న వీరు.. బాత్రూంకు వెళ్తామని చెప్పి, కిందికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

'సాధన' విద్యార్థుల విజయదుందుబి



అభినందిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

కరీంనగర్: పట్టణంలోని జ్యోతినగర్ సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణులై, విజయదుందుబి మోగించారు. గర్రెపల్లి సాత్విక రాణి 10 జీపీఏ, చింతపల్లి శ్రాగ్వి 9.8, పల్లెర్ల రోహిత్ 9.7, సజ్జన శ్రేయాస్ 9.7, సీహెచ్.దీయ 9.5, జి.అఖిల 9.5 జీపీఏ, 9, ఆపైన జీపీఏ 21 మంది సాధించారని పాఠశాల చైర్మన్ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విదార్థులను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీహెచ్.నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిట్టల్లా రాలుతున్నారు

- హడలెత్తిస్తున్న భానుడు
- ఎండవేడిమికి తాళలేక జనం విలవిల
- వడదెబ్బతో ఒకేరోజు ఐదుగురు మృతి



తిమ్మాపూర్/రామడుగు/జమ్మికుంట/కోరుట్ల/గంభీరావుపేట: సూరీడు నిప్పులుకక్కుతున్నాడు. వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 8 గంటలు దాటిందంటే చాలు వేడి.. ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. బుధవారం ఒకేరోజు వడదెబ్బతో ఉమ్మడి జిల్లాలో ఐదుగురు మృతిచెందారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పోలేపు శంకర్(36) బోరు మరమ్మతు చేస్తూ కుప్పకూలి మృతిచెందాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన రో డ్డ నర్సయ్య(46) పొద్దంతా ఆటోనడిపి సాయంత్రం ఒక్కసారిగా అస్వస్థతకు గురై మృతిచెందా డు. జమ్మికుంటకు చెందిన నిమ్మ సరోజన(50) పోచమ్మ గుడి ఆవరణలో శుభ్రం చేస్తూ అస్వస్థకు గురై చనిపోయింది. రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన దివ్యాంగ బాలుడు యశ్వంత్(5) ఎండదెబ్బకు చనిపోయాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన చిప్పకుర్తి బాబు (49) నిజామాబాద్ జిల్లా వర్నిమండలం పెద్దగుట్టకు కాలినడకన వెళ్తూ ఎండదెబ్బతో చనిపోయాడు.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత



ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న ఆలియాస్ జిను(66), కాసరబోయిన వినయ్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చిరోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పొడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

- ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

- మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
- మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
- విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిద్ధ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

➡ 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పుర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.


విప్లవోద్యమంలో రాలిన ఎర్ర మందారం

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో కాసవేణ రవి మృతి
- బెల్లంపల్లిలో విప్లవోద్యమ ఓనమాలు
- మూడు దశాబ్దాలకు పైగా అజ్ఞాతం
- ఆదివాసీ పోరాటాలకు నాయకత్వం

బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా టేక్‌మెట–కాకూర్ గ్రామాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఎర్రమందారం నేలరాలింది. మూడు దశాబ్దాల అజ్ఞాత వాసానికి మృతితో తెరపడింది. మృతిచెందిన పది మంది మావోయిస్టుల్లో బెల్లంపల్లికి చెందిన కాసవేణ రవి ఉరఫ్ అశోక్ ఉరఫ్ వినయ్(48) ఉండడం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. చిన్న వయస్సులోనే విప్లవోద్యమానికి ఆకర్షితుడై దండకారణ్య కమిటీ సభ్యుడిగా ఎదిగిన రవి మృతితో బెల్లంపల్లితోపాటు స్వగ్రామం వంగరలో విషాదం నెలకొంది.

సింగరేణి కార్మిక కుటుంబం

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కాసవేణ లక్ష్మి, రాజయ్య దంపతులు 1961లో బెల్లంపల్లికి వలస వచ్చారు. రాజయ్యకు సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగం రావడంతో బెల్లంపల్లి మున్సిపాల్టీ కన్నాలబస్తీలోని సింగరేణి క్వార్టర్స్‌లో నివాసం ఉన్నారు. వీరికి కుమారులు వెంకటేష్, తిరుపతి, రవి, కూతురు హాల్య ఉన్నారు. అందరికంటే చిన్నవాడైన రవి విప్లవోద్యమంలోకి వెళ్లిన తర్వాత రాజయ్య 2001లో కార్మికుడిగా రిటైర్డు అయ్యాడు. అనంతరం స్వస్థలం వంగరకు వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు.



ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రవి

బాల్యంలోనే విప్లవబాట

రవి స్థానిక టేకులబస్తీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల(హౌజ్‌ల బడి)లో 7వ తరగతి వరకు చదివాడు. 8వ తరగతి కోసం బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరాడు. 9వ తరగతి నుంచి విప్లవోద్యమాలకు ఆకర్షితుడయ్యాడు. అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస)లో మిలిటెంట్‌గా పని చేశాడు. సికాస శ్రేణులకు కొరియర్‌గా పని చేస్తూ పోలీసుల నిర్బంధంలో ఎంతో నేర్పుగా వాల్‌పోస్టర్లు వేయడంలో దిట్టగా పేరుగాంచాడు. గంగారాంనగర్ బస్తీ ఏర్పాటు, పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించాడు. ఈ క్రమంలో చదువుపై దృష్టి సారించకపోవడంతో పదో తరగతి తప్పాడు. దీంతో పెద్దన్న వెంకటేష్ రవిని మందలించాడు. అప్పటికే సికాస కార్యకలాపాల్లో రవి పేరు బెల్లంపల్లిలో మారుమోగడంతో పోలీసులు వెతకడం తీవ్రతరం చేశారు. 16ఏళ్ల ప్రాయంలో విప్లవోద్యమానికి జీవితం అంకితం చేసి 1993లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. చెన్నూర్ దళంలో కొంత కాలం పని చేసిన తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా దండకారణ్యంలోకి వెళ్లి ఉద్యమ వ్యాప్తికి తన వంతు పాత్ర పోషించాడు.

అంచెలంచెలుగా దండకారణ్య కమిటీ సభ్యుడిగా ఎదిగి..

సాధారణ కార్యకర్తగా సికాసలో చేరిన రవి మిలిటెంట్‌గా రూపాంతరం చెందాడు. బెల్లంపల్లి కోల్‌బెల్ట్ ప్రాంతంలో వివిధ హోదాల్లో పని చేసి మూడు దశాబ్దాలకు పైగా దండకారణ్యం కేంద్రంగా విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. పోలీసు ఎదురుకాల్పుల్లో ఎన్నోసార్లు చాకచక్యంగా తప్పించుకున్నాడు. దండకారణ్యంలో ఆదివాసీలతో దండు కూడగట్టాడు. మావోయిస్టు పార్టీలో దండకారణ్య కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగాడు. విప్లవ ప్రస్థానంలో సవాళ్లతో సహవాసం చేస్తూ అడవుల్లో అస్తమించి అమరుడయ్యాడు.

భౌతికదేహం కోసం వెళ్లిన కుటుంబీకులు

రవి భౌతిక దేహాన్ని తీసుకు రావడానికి సోదరుడు వెంకటేష్, సన్నిహితులు, బంధువులు ఛత్తీస్‌గఢ్‌కు బుధవారం వెళ్లారు. గురువారం రవి భౌతికకాయంతో స్వగ్రామం వంగరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంత్యక్రియలు వంగరలోనే నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

జిజ్ఞాస పోటీల్లో మొదటి బహుమతి



బహుమతి పొందిన విద్యార్థినులు



ప్రశంసపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో కరీంనగర్ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సంస్కృతి ఆడిటోరియంలో బుధవారం బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ఉర్దూ విభాగం నుంచి ఖలీం మొహియుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు తెలంగాణ మెయిన్ ఉర్దూగా ఫెస్టివల్ నిజామీతలీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. కళాశాల విద్య కమిషనర్ బుర్రా వెంకటేశం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, ప్రాజెక్టు సూపర్‌వైజర్, విద్యార్థినులకు బహుమతితోపాటు రూ.30 వేలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల విద్య కమిషనర్ కార్యాలయ ఏజీవో బాలభాస్కర్, జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, ఆర్‌జేడీ యాదగిరి, రూసా కో–ఆర్డినేటర్ సౌందర్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థులకు తృతీయ..

హిందీ సహ ఆచార్యుడు వి.వరప్రసాద్ పర్యవేక్షణలో మహమ్మద్ ముజు తబా, మహమ్మద్ ఆసిఫ్, షేక్ షర్జీల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ తదితర విద్యార్థులు సోషల్ మీడియాలో హిందీ భాష : ఒక అధ్యయనం(వాట్సాప్, ఫేస్ బుక్‌లకు ప్రత్యేకంగా) అనే ప్రాజెక్టు రూపొందించారు. ఇది తృతీయ బహుమతి గెలుచుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు వారిని అభినందించారు.

అగ్రహారం విద్యార్థులకు ద్వితీయ బహుమతి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు ఇటీవల కళాశాల విద్యాశాఖ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఇంపాక్ట్ ఆఫ్ రైతుబంధు స్కీమ్ ఆన్ ఫార్మర్స్, ఏ స్టడీ ఆఫ్ రాజన్నసిరిసిల్ల డిస్ట్రిక్ట్' అనే అంశంపై స్టడీ ప్రాజెక్టు రూపొందించారు. రాష్ట్రస్థాయిలో పోటీపడ్డ 20 ప్రాజెక్టులలో అగ్రహారం విద్యార్థుల ప్రాజెక్టు రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జిజ్ఞాస పోటీలలో ద్వితీయ బహుమతి సాధించిన కామర్స్ అధ్యాపకులు మల్లారెడ్డి, విద్యార్థులు వి.సుష్మ, ఎం.లహరిక, రాజేశ్, యశ్వంత్, అనిరుధ్‌లను అభినందించారు.

రిమ్స్‌లో స్కాన్ అండ్ షేర్



స్కాన్ అండ్ షేర్‌ను ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆసుపత్రితో పాటు సూపర్ స్పెషాలిటీలోనూ స్కాన్ అండ్ షేర్ క్యూఆర్ కోడ్ విధానం అమల్లోకి తెచ్చారు. పేషెంట్లు రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించి ఉండకుండా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ మొబైల్ కలిగి ఉన్న వారు ప్లేస్టోర్ ద్వారా ఏబీహెచ్ఏ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ టోకెన్ నంబర్ వస్తోంది. కౌంటర్ వద్ద ఆ నంబర్ చెబితే సరిపోతోంది. వివరాలన్నీ అందులోనే నిక్షిప్తమై ఉంటాయి. సంబంధిత వైద్యుడి వద్దకు వెళ్లి అవసరమైన చికిత్స పొందవచ్చు. ఈ విధానాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఎంవో చందు, ఆయుష్మాన్ భారత్‌మిషన్ సిబ్బంది రేణుక, అశ్విన్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ అనిత రాజేంద్రన్

- పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ అనిత రాజేంద్రన్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అనిత రాజేంద్రన్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. కంపోస్ట్ షెడ్డును సందర్శించి తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. వారి వెంట డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తదితరులున్నారు.

పీఆర్ పథకాలు పటిష్టంగా అమలు చేయాలి

గుడిహత్నూర్: పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న పలు పథకాలు, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆమె తోషంలో నిర్వహిస్తున్న ఎరువుల తయారీ కేంద్రం, మొక్కల నర్సరీని పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డీఎల్పీవో ఫణిందర్, డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్‌హై, ఏపీవో శామ్యూల్, కార్యదర్శి లావణ్య తదితరులున్నారు.

రామగుండంలో భారీగా యూరియా ఉత్పత్తి



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) కర్మాగారంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించారు. గత ఏప్రిల్‌లో 1,14,002.82 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసి రికార్డు సాధించామని సీజీఎం సుధీర్‌కుమార్ ఝా తెలిపారు. ఇంతవరకు తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా యూరియా సరఫరా చేశామని వివరించారు.

యూరియా సరఫరా తీరు ఇలా(మె.ట)

రాష్ట్రం	సరఫరా
తెలంగాణ	35,332.65
ఆంధ్రప్రదేశ్	8,407.98
కర్ణాటక	20,319.75
మహారాష్ట్ర	14,649.12
ఛత్తీస్‌గఢ్	13,526.37
తమిళనాడు	13,520.43
మధ్యప్రదేశ్	8,246.52

ఎన్టీపీసీ బూడిదను వదలని మంత్రి 'పొన్నం'



మాట్లాడుతున్న ఎస్సీమోర్చా జాతీయ ప్రధానకార్యదర్శి ఎస్.కుమార్, చిత్రంలో రాణిరుద్రమ తదితరులు

- బండి చేసిన అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు
- బీజేపీ నేతలు ఎస్.కుమార్, రాణి రుద్రమ

కరీంనగర్‌టౌన్: ఎన్టీపీసీ బూడిదను వదలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీజేపీ 400 సీట్లకు పైగా గెలుస్తుందని తెలిసి పొన్నం కాలుకాలిన పిల్లిలా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతిపరుడని, ఓ ట్రావెల్స్ అధినేత నుంచి రూ.కోటిన్నర విలువైన కారుతో పాటు ఎన్టీపీసీ బూడిద నుంచి లంచాలు తీసుకున్న ఘనత పొన్నందే అన్నారు. బూడిద తీసుకెళ్లే లారీలను ఆపేసి కాంట్రాక్టర్‌ను బెదిరించి తొలుత రూ.2 కోట్లు, తరువాత మరో రూ.6 కోట్లు ఆయనతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బూడిద స్కాంపై సీబీఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. నాయకులు కన్నబోయిన ఓదెలు, రమణారెడ్డి, లోకేశ్, బొంతల కల్యాణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.